సాక్షి
అనంతపురం

శుక్రవారం ׀ 10 ׀ మే ׀ 2024



బటన్ నొక్కితే గిర్రున తిరగాలి: ఫ్యాన్ గుర్తు చూపుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఆశీర్వదించండి
అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యను ఆశీర్వదించాలని కోరుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ నేత ఉమా మహేశ్వరనాయుడు



కళ్యాణదుర్గం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఒక భాగం



మేమున్నామన్నా: సీఎం సభలో వైఎస్సార్ సీపీ జెండాతో ఓ యువతి ఉత్సాహం

జయహో... జగన్

కళ్యాణదుర్గం/కళ్యాణదుర్గం రూరల్: సీఎం జగన్ పర్యటన సందర్భంగా గురువారం కళ్యాణదుర్గం 'జయహో జగన్' అంటూ నినదించింది.

- **ఉదయం 9 గంటలు:** జనం రాక ప్రారంభమైంది.
- **11 గంటలు:** సభాస్థలి ఏర్పాటు చేసిన కొల్లాపురమ్మ గుడి వద్ద జన సాగరం పోటెత్తింది.
- 'భళిరా భళిభళి భళిరా..' పాటకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేశారు.
- **12.50 గంటలు:** కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణ బస్సు వద్దకు చేరుకుని ప్రసంగించారు.
- 'బ్రహ్మసముద్రం నుంచి బంధువులు, శెట్టూరు నుంచి స్నేహితులు, కంబదూరు నుంచి కంటిపాపలా కాపాడుతున్న హితులు, కుందుర్పి నుంచి కుటుంబ సభ్యులు, కళ్యాణదుర్గం నుంచి వచ్చిన నా ప్రాణ స్నేహితులు' అని రంగయ్య ప్రసంగం ప్రారంభించగానే.. సభా ప్రాంగణం 'జై తలారి రంగయ్య' అంటూ హోరెత్తింది.
- **1.06 గంటలు:** సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్ ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయ్యింది.
- **1.16 గంటలు:** హెలిప్యాడ్ వద్ద నుంచి బస్సులో సీఎం జగన్ సభాస్థలికి బయలుదేరారు.
- **1.46 గంటలు:** సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన బస్సుపైకి సీఎం జగన్ చేరుకున్నారు. 'కళ్యాణదుర్గం సిద్ధమా' అంటూ సీఎం అనగానే సభాస్థలిలో ఉన్న వారితో పాటు మిద్దెలు, మేడలపై ఉన్న జనం 'మేము సిద్ధం... కళ్యాణదుర్గం సిద్ధం' అంటూ పెద్ద ఎత్తున నినదించారు.
- **1.50 గంటలు:** సీఎం వైఎస్ జగన్ ప్రసంగం ప్రారంభించారు.
- **2.50 గంటలు:** సభా స్థలం నుంచి హెలిప్యాడ్ వద్దకు బయలు దేరారు.
- **3 గంటలు:** హెలికాప్టర్‌లో రాజంపేట వెళ్లారు.
- జగన్ మాస్కులతో యువత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జైకొట్టిన జనదుర్గం

అడుగు..అడుగు కలిసింది. ఆత్మీయుడిని చూసేందుకు అభిమానం పరుగు తీసింది. ఉప్పెనలా మారి కళ్యాణదుర్గంలో పోటెత్తింది. జననేత జగన్‌ను చూడాలన్న సంకల్పం ముందు మండుటెండ దూదిపింజలా మారిపోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం వైఎస్ జగన్ గురువారం కళ్యాణదుర్గంలో పర్యటించగా పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. చంటిబిడ్డలతో మహిళలు, చేతికర్రతో వృద్ధులు.. జగన్ మాస్కులతో యువత తరలివచ్చింది. జగన్ సైన్యం తరంగంలా కదిలిరాగా పట్టణం జనసంద్రాన్ని తలపించింది.

- జగన్ పర్యటనతో 'దుర్గం'లో ప్రభం'జనం'
- రోడ్ షోలో హోరెత్తిన జగన్నినాదం
- మండుటెండను సైతం లెక్కచేయక కదం తొక్కిన అభిమానం

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా గురువారం కళ్యాణదుర్గంలో జనసునామీ కనిపించింది. హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన ప్రాంతంతో పాటు కొల్లాపురమ్మ గుడి వద్ద నుంచి వాల్మీకి సర్కిల్, శెట్టూరు రోడ్, కంబదూరు, ధర్మవరం రోడ్‌లు అభిమానులతో పోటెత్తాయి. వీధులన్నీ వైఎస్సార్‌సీపీ జెండాల మయం కాగా, కళ్యాణదుర్గం నూతన శోభను సంతరించుకుంది. సీఎం జగన్ మధ్యాహ్నం వస్తారని తెలిసినా ఉదయం 9 గంటల నుంచే నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం కళ్యాణదుర్గానికి చేరుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా జగన్ కోసం వేచి చూశారు. మధ్యాహ్నం 1.06 గంటలకు ఏపీ మోడల్ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సీఎం దిగగానే అప్పటికే అక్కడ వేచి చూస్తున్న జనసందోహం జై జగన్ అంటూ నినదించింది. అక్కడి నుంచి బస్సులో రోడ్డు మార్గాన వాల్మీకి సర్కిల్‌కు బయలుదేరిన జననేత జగన్‌కు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. అనంతరం వాల్మీకి సర్కిల్ వద్దకు చేరుకున్న జగన్... మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి కొల్లాపురమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఇక సభా స్థలి సమీపంలోనూ చాలా మంది మిద్దెలు, మేడలు ఎక్కి తమ అభిమాన నేతకు నమస్కరించగా, జగన్ కూడా వారికి అభివాదం చేశారు. సీఎం వైఎస్ జగన్ బస్సుపైకి చేరుకోగానే ఆ ప్రాంతం ఒక్కసారిగా జగన్నినాదంతో మార్మోగింది. సీఎం జగన్ 'కళ్యాణదుర్గం సిద్ధమా' అంటూ ప్రసంగం ప్రారంభించగానే 'మేమంతా సిద్ధం' అంటూ ప్రజలు నినదించారు. 'మేమున్నాం జగనన్నా' అంటూ మద్దతు పలికారు. పట్టణంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి సీఎం జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేతలు మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, ఎల్‌ఎం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నేత



కరణం రాహుల్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్..చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి

కళ్యాణదుర్గం: జనసేన పార్టీ నాయకుడు కరణం రాహుల్ గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కళ్యాణదుర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని రాహుల్‌కు సూచించారు. రాహుల్ 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. రాహుల్ చేరికతో కళ్యాణదుర్గంలో వైఎస్సార్ సీపీకి కొత్త ఊపు వచ్చినట్లయ్యింది.



మా అండ: జగన్ చిత్రపటాన్ని చూపుతున్న యువకుడు



ఆకాశమంత అభిమానం: మిద్దెలెక్కి జగన్ ప్రసంగం వింటున్న జనం



గగన వీధిలో జన జెండా: స్తంభంపై జెండా ఎగురవేస్తున్న యువత



ఉరిమే ఉత్సాహం: సీఎం సభలో జై జగన్ అంటూ నినదిస్తున్న మహిళలు

వెన్నుపోటు బాబును నమ్మకండి



రాష్ట్రంలో పేదవాడికి, పెత్తందారులకు యుద్ధం జరుగుతోంది. తన హయాంలో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు ఒక వైపు...సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన సీఎం వైఎస్ జగన్ మరోవైపు ఎన్నికల్లో నిలబడుతున్నారు. చంద్రబాబు అంటే వెంటనే గుర్తువచ్చేది వెన్నుపోటు. విశ్వసనీయత అంటే గుర్తుకు వచ్చేది సీఎం వైఎస్ జగన్. వెన్నుపోటు బాబును నమ్మకండి. ఆయన గతంలోలాగే ఇప్పుడూ హామీలిస్తున్నారు. నమ్మితే నట్టేట మునిగినట్టే. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన వైఎస్ జగన్‌కు మద్దతు తెలపండి. కమీషన్లతో బతికే చంద్రబాబు కళ్యాణదుర్గంలో బడా కాంట్రాక్టర్‌ను దింపారు. అభివృద్ధి చేయాలనే తపనతో సీఎం జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా రంగయ్యను, ఎంపీ అభ్యర్థిగా నన్ను నిలిపారు. ఆలోచించి ఓటు వేయండి. అభివృద్ధికి పట్టం కట్టండి. 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్యకు, ఎంపీ అభ్యర్థినైన నాకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి.

– శంకర నారాయణ, వైఎస్సార్ సీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి

ఆదరించండి.. అభివృద్ధికి పాటుపడతా



పక్కనున్న కొల్లాపురమ్మ సాక్షిగా, కనిపిస్తున్న అక్కమాంబ, ఎదురుగా ఉన్న వాల్మీకి మహర్షి స్ఫూర్తిగా చెబుతున్నా. నా జీవితాంతం కళ్యాణదుర్గం అభివృద్ధికి పాటుపడతా. ఏ ఆడబిడ్డా బిందె తీసుకుని బయటకు వెళ్లకుండా.. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ కొళాయి ఏర్పాటు చేసి తాగునీరందిస్తా. సీఎం జగనన్న సహకారంతో కళ్యాణదుర్గంలోని 114 చెరువులకు నీరిచ్చేందుకు బీటీపీ వరకు కాలువలు తవ్వి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా. ఆగిపోయిన రాయదుర్గం- తుమకూరు రైల్వే పనుల కోసం ఎంపీగా రూ.250 కోట్లు తీసుకువచ్చా. ఈ ప్రాంత వాసులు త్వరలోనే కళ్యాణదుర్గం నుంచి బెంగళూరుకు రైలులో ప్రయాణించేలా చూస్తా. మనకోసం సీఎం జగనన్న 130 సార్లు బటన్ నొక్కి సంక్షేమ పథకాలు ఇచ్చారు. ఇప్పుడు సీఎం జగనన్న కోసం, మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు.. 13వ తేదీ పోలింగ్ రోజున రెండు సార్లు ఫ్యాను గుర్తుపై బటన్ నొక్కాలి.

– తలారి రంగయ్య, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి



ఆనంద తాండవం: జగన్ సభలో నృత్యాలు చేస్తున్న మహిళలు



నీరాజనం: సభాస్థలికి బస్సులో వస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న జనం



అదిగదిగో జగనన్న: సీఎం జగన్‌ను చూసి చెయ్యెత్తి జైకొడుతూ మురిసిపోతున్న ప్రజలు



జనసాగరం: సభ ఏర్పాటు చేసిన కొల్లాపురమ్మ గుడివద్ద కిటకిటలాడుతున్న జనం

క్లుప్తంగా

మార్కెట్‌కు 1,270 క్వింటాళ్ల చింతపండు రాక


మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 1,270 క్వింటాళ్ల చింత పండు వచ్చింది. ఈ-నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. కరిపులి రకం క్వింటా కనిష్ట ధర రూ.8,050తో అమ్ముడు పోగా గరిష్టంగా రూ.12,500 చొప్పున సగటు రూ.10,500 ధర పలికింది. ఫ్లవర్ రకం కనిష్టం రూ.4వేలు, గరిష్టం రూ.7 వేలు, సగటున రూ.5,800 చొప్పన అమ్ముడు పోయింది. బోటు రకం కనిష్టం రూ. 2600, గరిష్టం రూ.3వేలు, సగటున రూ.2,700 ధర పలికింది. ఈ మేరకు మార్కెట్ యార్డు కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.

జిల్లా సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం చేయండి


కంబదూరు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న అబ్జర్వర్ రవికుమార్

కంబదూరు: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ సమీపిస్తుండడంతో జిల్లా సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టం చేయాలని కర్ణాటక నుంచి మద్యం, నగదు, డ్రగ్స్ ఇతరత్రాలు ఏవీ అక్రమ రవాణా జరగకుండా సమర్థవంతంగా అడ్డుకోవాలని చెక్‌పోస్టు సిబ్బందిని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ రవికుమార్ ఆదేశించారు. గురువారం కంబదూరు సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. చెక్‌పోస్టు రహదారిపైనే కాకుండా కాలినడక దారులు, బండి రస్తాలపై కూడా నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు నాగరాజు, ఇస్మాయిల్, ఎస్‌ఐ ఆంజనేయులు ఉన్నారు.

చీనీ టన్ను రూ. 34వేలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చీనీ టన్ను రూ.34వేలతో అమ్ముడు పోయింది. రెండో రకం రూ.21 వేలు, మూడో రకం రూ.14 వేలు చొప్పున మొత్తం 712 టన్నుల విక్రయాలు సాగాయి. ఈ మేరకు మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు.

ప్రచారాలకు రేపే ఆఖరు

- పోలింగ్‌కు చివరి 72 గంటలు ఈసీ నిబంధనలు అందరూ పాటించాలి
- 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ
- రెండు రోజుల పాటు 144 సెక్షన్ అమలు
- పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో మద్యం విక్రయాలు బంద్
- జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ వెల్లడి


ఎన్నికల మస్కట్ స్టిక్కర్ విడుదల చేస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్, తదితర అధికారులు

అనంతపురం అర్బన్: పోలింగ్‌కు చివరి 72 గంటలు అత్యంత కీలకమైన సమయమని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎలాంటి ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పోలింగ్‌కు చివరి 72 గంటలు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎస్పీ అమిత్ బర్దర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ఉంటుందని, ఈ క్రమంలో పోలింగ్ జరిగే రోజుతో పాటు కౌంటింగ్ నాడూ మద్యం విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ రోజు నుంచి మరుసటి రోజు వరకు 144 సెక్షన్ అమలులోఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిఘా మరింత పటిష్టం

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సజావుగా జరిగేందుకు నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేశామన్నారు. జిల్లాలోకి మద్యం, నగదు, వస్తువులు అక్రమ రవాణా అడ్డుకునే విషయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు మరింత అప్రమత్తంగా పనిచేస్తాయన్నారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తారన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. లాడ్జీలు, కల్యాణమంటపాలు, తదితర వాటిల్లో విస్తృత తనిఖీలు చేపడతారన్నారు. బయటి వ్యక్తులు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. 32 బ్యాంకులపై నిఘా మరింత పెంచామన్నారు. రూ.లక్ష అంతకంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీలు జరిగే ఖాతాలపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు. ఎక్కువ మంది చిన్న మొత్తంలో యూపీఐ ద్వారా నగదు పంపించే ఖాతాలపై కూడా నిఘా పెంచుతున్నట్లు పేర్కొన్నారు.

పీఎస్‌ల్లో వెబ్‌కాస్టింగ్

జిల్లాలోని 2,236 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో నాలుగు అంచెల నిఘా ఉంటుందన్నారు. కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, బయట హ్యాండ్ కెమెరా చిత్రీకరణ ఉంటుందన్నారు. పోలింగ్ క్రమంలో సిబ్బందికి ఏవేని సమస్యలు ఉత్పన్నమైతే తక్షణ పరిష్కారానికి ప్రత్యేకంగా నియోజకవర్గానికి 10 మంది చొప్పున 70 మంది అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు

సజావుగా పోలింగ్ నిర్వహణకు రాజకీయ పార్టీలకు చెందిన వారు సహకరించాలన్నారు. పార్టీల వ్యక్తులు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే ఉండాలన్నారు. ఎలాంటి హంగు లేకుండా 200 మీటర్ల దూరంలో బూత్‌లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కేంద్రాల్లోకి ఓటర్లు, ఎన్నికల సిబ్బంది తప్ప అనధికార వ్యక్తులు ప్రవేశించకూడదన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల్లో ఓటు వేద్దాం

అనంతపురం అర్బన్: 'ఎన్నికల్లో మనమంతా ఓటు వేద్దాం' అంటూ ప్రజలకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఓటు వేద్దాం - నా ఓటు... నా బాధ్యత' పేరుతో ముద్రించిన ఎన్నికల మస్కట్ స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యమన్నారు. పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేలా కార్యక్రమాలు విస్తృతం చేసినట్లు గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఓటు వేద్దాం పేరుతో ఒక లక్ష ఎన్నికల మస్కట్ స్టిక్కర్లను సిద్ధం చేశామన్నారు. గత ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదైన ప్రతి నియోజకవర్గంలోని 10 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. ఓటరు స్లిప్‌లు గుర్తింపుకార్డు కింద పరిగణించబడవన్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన 12 కార్డుల్లో ఏదైనా ఒక కార్డు చూపి ఓటు వేయవచ్చునన్నారు. ఓటరు గుర్తింపు కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ గుర్తింపు కార్డు, ఫొటోతో ఉన్న బ్యాంక్ ఖాతా పుస్తకం, పాస్‌పోర్టు, కార్మిక శాఖ జారీ చేసిన స్మార్ట్ కార్డ్, ఉపాధి హామీ జాబ్‌కార్డ్, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ కార్డు, అధికారిక గుర్తింపు కార్డు (ఎంఎల్‌ఏ, ఎంపీలకు జారీ చేసినవి), ఆధార్ కార్డు వీటిలో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు.

ఓటుకు 'పచ్చ'నోటు!

- పోస్టల్ బ్యాలెట్ల కోసం టీడీపీ బరితెగింపు
- ఉద్యోగులను ప్రలోభాలకు గురి చేసిన నాయకులు
- ఒక్కో ఓటుకు రూ. 3 వేలు చొప్పన కవర్‌లో పెట్టి ఇచ్చిన వైనం



అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి నుంచి గట్టెక్కేందుకు టీడీపీ అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచే తాయిలాలకు తెర తీసిన ఆ పార్టీ నాయకులు చివరకు ఉద్యోగులనూ ప్రలోభాలకు గురి చేసింది. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయానికి చివరి రోజు అయిన గురువారం అనంతపురంలో బాహాటంగానే ఈ తంతు కొనసాగించారు. అనంతపురం నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అయితే అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయని అంచనాకు వచ్చిన టీడీపీ నాయకులు వెంటనే కవర్లతో రంగంలో దిగారు. సార్... అన్నా... అని పలకరిస్తూ ఈ కవర్ తీసుకోండి సైకిల్ గుర్తుకు ఓటేయండి అంటూ ఎర వేసేందుకు ప్రయత్నించారు. కవరులో రూ. 3 వేల వరకు నగదు ఉంచారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలో చెట్ల కింద ఉంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాగానే వారిని చుట్టు ముట్టి కవర్లు చేతిలో పెడుతూ చేపల మార్కెట్‌ను తలపించారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ


ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరా

కళ్యాణదుర్గం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కళ్యాణదుర్గానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ, ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎంఎల్‌సీ మంగమ్మ, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ ఎం మోహన్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.


అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


పార్టీ పరిశీలకులు ప్రసాద్‌రెడ్డిని పలకరిస్తున్న సీఎం జగన్..చిత్రంలో ఎల్‌ఎం మోహన్‌రెడ్డి

మద్యం తరలిస్తున్న టీడీపీ నేత అరెస్ట్


గుమ్మనూరు జయరాంతో శ్రీనివాసులు (ఫైల్)

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మద్యం తరలిస్తూ ఓ టీడీపీ నేత సెబ్ పోలీసులకు పట్టుబడ్డాడు. గుంతకల్లు మండలం నెలగొండ గ్రామానికి చెందిన టీడీపీ నేత సింగాడి శ్రీనివాసులు గురువారం ఉదయం గుంతకల్లు నుంచి దాదాపు 50 మద్యం బాటిళ్ల తీసుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. బస్టాండ్ సమీపంలోకి చేరుకోగానే శ్రీనివాసులు కదలికలపై అనుమానం వచ్చిన సెబ్ పోలీసులు తనిఖీ చేశారు. అతని వద్ద ఓ బ్యాగులో 35 బాటిళ్లు, మరో బ్యాగులో 15 మద్యం బాటిళ్లను గుర్తించి, అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ ఎస్‌ఐ జఫుల్లా తెలిపారు. కాగా, గుమ్మనూరు జయరాం గురువారం సాయంత్రం గుంతకల్లులో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి నెలగొండ నుంచి జనసమీకరణ చేసేందుకు మద్యం కొనుగోలు చేసి తరలిస్తున్నట్లుగా తెలిసింది.

వలంటీర్ దుర్మరణం


తిమ్మరాజు (ఫైల్)

కంబదూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వలంటీర్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... కంబదూరు మండలం అచ్చంపల్లికి చెందిన వలంటీర్ ఉప్పెర తిమ్మరాజు (26) గురువారం ఉదయం కళ్యాణదుర్గంలో జరిగిన సీఎం వైఎస్ జగన్ సభకు హాజరయ్యారు. సభ ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన ఆయనను కదిరిదేవరపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన టాటా సుమో ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన తిమ్మరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం : తలారి రంగయ్య

కాగా, ప్రమాదంలో వలంటీర్ తిమ్మరాజు మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ నేత ఉమామహేశ్వరనాయుడుతో కలసి కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి చేరుకుని తిమ్మరాజు మృతదేహానికి నివాళులర్పించారు. ప్రమాదంపై ఆరా తీశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అధైర్యపడకూడదని అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, సీనియర్ నాయకుడు తిమ్మరాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైస్ ఎంపీపీ భీమేష్ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- సీఈఓకు తెలిపిన జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్


సీఈఓ వీసీలో పాల్గొన్న వినోద్‌కుమార్, చిత్రంలో డీఐజీ షెముషి, ఎస్పీ అమిత్‌బర్దర్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, ఏసీ వినూత్న

అనంతపురం అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. పోలింగ్‌కు ఆఖరు 72 గంటలు అంశంపై సీఈఓ గురువారం విజయవాడ నుంచి కలెక్టర్లు, డీఐజీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వినోద్‌కుమార్‌తో పాటు డీఐజీ షెముషి బాజ్‌పాయ్, ఎస్పీ అమిత్‌బర్దర్, జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధతపై సీఈఓకు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. పోలింగ్ కేంద్రాలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయనున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖపరంగా చేపడుతున్న చర్యలను సీఈఓకు డీఐజీ, ఎస్పీ వివరించారు.

ఆ రెండు రోజులూ పశువుల సంత, చీనీ మార్కెట్‌కు విరామం

అనంతపురం అగ్రికల్చర్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 12, 13 (ఆది, సోమవారం) తేదీలలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో పశువుల సంత, చీనీ కాయల విక్రయాలకు తాత్కలిక విరామం ప్రకటించారు. ఈ మేరకు యార్డు సెక్రటరీ జయలక్ష్మి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విషయాన్ని గుర్తించి రైతులు, వ్యాపారస్తులు తమ సరుకు, పశువులను మార్కెట్‌కు తీసుకురావద్దని కోరారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మార్కెట్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు.

టీడీపీలోకి చేరలేదని సేద్యం పరికరాలకు నిప్పు


కాలి బూడిదైన స్ప్రింక్లర్ పైపులను చూపుతున్న రైతు గోపాల్

రామగిరి: పార్టీలోకి చేరలేదన్న అక్కసుతో ఓ రైతుకు చెందిన సేద్యం పరికరాలకు టీడీపీ నేతలు నిప్పు పెట్టారు. బాధిత రైతు తెలిపిన మేరకు... రామగిరి మండలం పెద్ద కొండాపురం గ్రామానికి చెందిన రైతు గొల్ల గోపాల్ తనకున్న పొలంలో బోరు బావులకింద వరి, టమాట, వేరుశనగ పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల పంట సాగు ముగియడంతో వంద స్ప్రింక్లర్ పైపులను చెట్ల నీడన చేర్చాడు. బుధవారం రాత్రి దుండగులు నిప్పు పెట్టడంతో పైపులు, పరికరాలు పూర్తిగా కాలిపోయాయి. గురువారం ఉదయం పొలానికి వెళ్లినప్పుడు విషయాన్ని గుర్తించిన రైతు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. కొన్ని రోజులుగా మాజీ మంత్రి పరిటాల సునీత వర్గీయులు తనను పలుమార్లు కలసి టీడీపీలోకి రావాలంటూ ఆహ్వానించారని, తాను ససేమిరా అనడంతో ఈ దారుణానికి ఒడిగట్టారంటూ ఆరోపించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న 22,269 మంది


పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

అనంతపురం అర్బన్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఇందు కోసం ఈ నెల 8వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల విధుల్లో ఉద్యోగులు, డైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు, పోలీసు సిబ్బంది, ఇతర జిల్లా ఉద్యోగులను కలుపుకుని 26,685 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పించారు. ఇందులో జిల్లాకు చెందిన 24,454 మంది ఉద్యోగులు, ఇతర జిల్లాలకు చెందిన 2,231 మంది ఉద్యోగులు ఉన్నారు. జిల్లా చెందిన 24,454 మందిలో 20,755 మంది పోస్టల్ బ్యాలెట్‌ను (84.87 శాతం) వినియోగించుకున్నారు. 3,699 మంది ఓటు వేయలేదు. ఇతర జిల్లాల ఉద్యోగులకు సంబంధించి 2,231 మంది ఉద్యోగుల్లో 1,514 పోస్టల్ బ్యాలెట్లు (67.1 శాతం) వినియోగించుకున్నారు. 717 మంది పోస్టల్ బ్యాలెట్ వేయలేదు. ఇక అత్యవసర సేవలందించే శాఖలకు చెందిన ఉద్యోగులకు సంబంధించి గురువారం నాటికి 529 (75.6శాతం) పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. వీరికి శుక్రవారం వరకు గడువు ఉంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఇలా

నియోజక వర్గం	మొత్తం బ్యాలెట్లు	పోలైన బ్యాలెట్లు
రాయదుర్గం	1,992	1,343
ఉరవకొండ	2,149	2,046
గుంతకల్లు	3,068	2,519
తాడిపత్రి	2,148	2,101
శింగనమల	2,018	1,598
అనంతపురం	6,546	5,759
కళ్యాణదుర్గం	2,695	2,150
రాప్తాడు	3,838	3,239
ఇతర జిల్లా ఉద్యోగులు	2,231	1,514
మొత్తం	26,685	22,269

ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యల్లో భాగంగా నలుగురిని సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో నార్పల మండలం సిద్ధారచెర్ల గ్రామానికి చెందిన వలంటీరు ఎం.యామిని, గార్లదిన్నె మండలం అదే గ్రామానికి చెందిన వలంటీర్లు బి.వీరారెడ్డి, జె.శివయ్య, సి.రామాంజినేయులుతో పాటు జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయ సబ్-ఆర్డినేట్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి సయ్యద్ తన్వీర్ ఉన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండండి

- అధికారులకు ఎన్నికల పరిశీలకుడు మనీష్ సింగ్ సూచన


ఆర్‌ఓ రామభూపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న మనీష్ సింగ్

తాడిపత్రి అర్బన్: రెండు రోజుల్లో ఎన్నికల కీలక ఘట్టం ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల సిబ్బందికి జిల్లా ఎన్నికల పరిశీలకుడు మనీష్ సింగ్ సూచించారు. తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రామభూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆంజనేయులు, అర్బన్ సీఐ మురళీకృష్ణతో గురువారం ఆయన సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై ఆరా తీశారు. పోలింగ్ రోజున ఎంత మంది సిబ్బందిని వినియోగిస్తున్నారని ఆర్‌ఓ రామభూపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సీఐ మురళీకృష్ణను ఆదేశించారు. అనంతరం కడప రోడ్డులోని జిల్లా సరిహద్దు ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు.

ఆలూడిలో దారుణం

- విద్యుత్ షాక్‌కు గురై కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


స్తంభంపై వేలాడుతున్న శ్రీనివాస్ మృతదేహం

అగళి: మండలంలోని ఆలూడి గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి షాక్‌కు గురై తీగలపైనే ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు... ఆలూడి పంచాయతీ లైన్‌మన్ మంజునాథ్ వద్ద దాదాపు నాలుగేళ్లుగా తాత్కాలిక ఉద్యోగిగా కంబదపల్లికి చెందిన శ్రీనివాస్ (49) పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 8.40 గంటలకు రైతులు ఉగ్రప్ప, రఘు పొలాల్లో 11 కేవీ లైన్ ఎగ్జిట్ ఫ్యూజ్ వేసేందుకు మంజునాథ్ ఆదేశాలతో శ్రీనివాస్ స్తంభం ఎక్కాడు. అదే సమయంలో విద్యుత్ ప్రసారం కావడంతో షాక్ గురై మృతి చెందాడు.

ఉద్యోగుల నిర్లక్ష్యమే కారణమా?

ట్రాన్స్‌కో ఉద్యోగుల నిర్లక్ష్యమే శ్రీనివాస్ మృతికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. వాస్తవానికి ఆలూడిలోని వ్యవసాయ పొలాలకు మధూడి ఫీడర్ లైన్ ఉండేది. అయితే లోడు ఎక్కువగా ఉండడంతో పి.బ్యాడిగెర ఫీడర్‌కు అనుసంధానం చేశారు. గురువారం ఉదయం తనకు ఎల్‌సీ కావాలని విషయాన్ని అదే ఫీడర్‌కు చెందిన లైన్‌మెన్ ఈరేగౌడ్‌కు ఫోన్ చేసి మంజునాథ్ అడిగారు. దీంతో తాను ఇదివరకే ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేస్తున్నానని తెలిపాడు. దీంతో మంజునాథ్ సూచన మేరకు శ్రీనివాస్ విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఎగ్జిట్ ఫ్యూజ్‌లు వేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలోనే పని పూర్తి చేసుకున్న ఈరేగౌడ.. మంజునాథ్ విషయం మరిచిపోయి షిఫ్ట్ ఆపరేటర్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించమన్నాడు. దీంతో స్తంభంపై ఉన్న శ్రీనివాస్ షాక్ గురై ప్రాణాలు కోల్పోయాడు.

ఫోన్లకు స్పందించని ఏఈ

వాస్తవానికి ట్రాన్స్‌కో ఏఈకి ముందస్తుగా తెలిపి ఆయన అనుమతితో ఎల్‌సీ తీసుకోవాల్సి ఉంది. అయితే ఏఈ చాంద్‌బాషా తన కింది స్థాయి ఉద్యోగుల ఫోన్‌లకు స్పందించడనే ఫిర్యాదులు చాలా ఉన్నాయి. ఈ క్రమంలోనే గురువారం తాను ఫోన్ చేస్తే ఏఈ స్పందించడనే కారణంతో పి.బ్యాడిగెర ఫీడర్ లైన్‌మెన్ ఈరేగౌడ ద్వారా మంజునాథ్ ఎల్‌సీ తీసుకున్నట్లు సమాచారం. సీఐ రాజ్‌కుమార్ అక్కడకు చేరుకుని శ్రీనివాస్ భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖలోని నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


వాల్మీకి సర్కిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


1,2వ వార్డు ప్రచారంలో పాల్గొన్న ప్రజలు, నాయకులు, కార్యకర్తలు

టీడీపీకి ఓటేస్తే గుమ్మనూరుకు ట్యాక్స్ కట్టాలి

- గల్లీకో బెల్ట్‌షాప్..వీధికో పేకాట క్లబ్ ఏర్పాటు చేస్తారు
- గుంతకల్లును కాపాడుకుందాం
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన గుంతకల్లులో పొరపాటున టీడీపీ అభ్యర్థి జయరామ్‌కు ఓటేస్తే ప్రతినెలా గుమ్మనూరు సర్వీస్ ట్యాక్స్(జీఎస్టీ) పేరిట దుకాణదారుల నుంచి వసూళ్లు చేయడం ఖాయమని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 18, 19, 26వ వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పాతగుంతకల్లులోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించిన అనంతరం ఆయన సభలో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలోని ఎల్లార్తి దర్గా వద్ద జంతువధ, ఇతర పన్నుల పేరిట గుమ్మనూరు సోదరులు చేసిన వసూళ్ల తరహాలోనే గుంతకల్లు నియోజకవర్గంలో ఉన్న ఒక్కో దుకాణం నుంచి రూ.2 వేలు వసూలు చేసుకోవాలని, ఎవరైనా అడ్డమొస్తే చూసుకుంటానని జయరామ్ భరోసా ఇచ్చినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గుమ్మనూరు జయరామ్ అసాంఘిక కార్యకలాపాలకు బ్రాండ్ అంబాసిడర్ అని, అతనికి టిక్కెట్ ఇచ్చిన చంద్రబాబే బహిరంగసభలో చెప్పారన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గుంతకల్లును దోచుకోవడానికి ఆలూరు నుంచి ఇక్కడికి వచ్చిన గుమ్మనూరు సోదరులు గల్లీకో బెల్ట్‌షాప్, వీధికో పేకాట క్లబ్‌ను ఏర్పాటు చేసి మన పిల్లల భవిష్యత్తును నాశనం చేయడం తథ్యమన్నారు. గుమ్మనూరు సోదరుల నుంచి మన గుంతకల్లును కాపాడుకుందామని ఎమ్మెల్యే వైవీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు మెహరున్నీసా, మాణిక్యం, మాచర్ల సుజాత, జింకల సుజాత, గంగమ్మ, దర్గాచెన్నమ్మ, లింగన్న, పార్టీ జిల్లా కార్యదర్శి నాగేంద్ర, నాయకులు మాచర్ల శివ, జింకల రామాంజి, శేఖర్, వసంత్, హనుమేష్, పాండు, మన్సూర్, మనోహర్, మహమ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకుందాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: అన్నం పెట్టినోళ్లను.మంచి చేసినోళ్లను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. సంక్షేమ క్యాలెండర్ ప్రకారం ప్రతినెలా ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ పేదప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించి రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 10, 11, 12, 13, 14, 15, 16, 17, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35 వార్డుల్లో ఆయన ప్రచారం చేశారు. ఆర్అండ్‌బీ సర్కిల్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే వైవీఆర్ మాట్లాడుతూ ప్రజలందరి చల్లని దీవెనలతో జగనన్న రెండోసారి ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్ వ్యవస్థను కొనసాగించేందుకు మొట్టమొదటి సంతకం చేస్తారన్నారన్నారు. నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో ద్వారా ప్రజలకు జరగబోయే మంచిని ఆయన వివరించారు. సూపర్‌సిక్స్ పేరిట ఎన్డీఏ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకర్‌నారాయణలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కౌన్సిలర్లు బి.విజయలక్ష్మి, నీలావతి, వెంకటేశ్వర్లు, రంగమ్మ, అర్షియాబేగం, కేవీ నాగరత్న, మహాలక్ష్మి, చాంద్‌బాషా, చాముండేశ్వరి, నగేష్, విద్యారాణి, సుమోబాషా, కోఆప్షన్‌సభ్యుడు రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎద్దుల శంకర్, యువజన విభాగం అధ్యక్షుడు బీకే.శివ, నాయకులు రంగారెడ్డి, హరినాథరెడ్డి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే మహిళలకు ఆత్మగౌరవం


లత్తవరం రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ


లత్తవరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి

- చెరువులకు నీరివ్వకుండా పయ్యావుల కేశవ్ అడ్డుకున్నాడు
- ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ

ఉరవకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారని, ఎవరిపైనా ఆధారపడకుండా సొంతకాళ్లపై జీవించే స్థాయికి ఎదిగారని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లత్తవరం, లత్తవరంతండా గ్రామాల్లో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం రోడ్‌షో నిర్వహించారు. లత్తవరంలో గ్రామ సర్పంచ్ పాలడగు వంశీ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందుల ఆధ్వర్యంలో గ్రామ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వకు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని ఆంజనేస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, రోడ్‌షో ప్రారంభించారు. అనంతరం విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సున్నా వడ్డీ పేరుతో మోసం చేసి ఎగ్గొట్టిన రూ.25 వేల కోట్లు జగన్ ప్రభుత్వం రాగానే చెల్లించారన్నారు. మరో వైపు లత్తవరం, లత్తవరంతండా, షేక్షానుపల్లి చెరువులకు నీరిస్తామంటే పయ్యావుల కేశవ్ అడ్డుకున్నాడని ధ్వజమెత్తారు. రైతుల మధ్య చిచ్చుపెట్టి అప్పటికే తవ్విన కాలువను పూడ్చి వేయించాడన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెరువులకు నీరు ఇచ్చి, ఆదుకుంటామన్నారు. కాలువకు భూములు ఇచ్చిన రైతులకు రూ.3కోట్ల పరిహారం మంజూరయ్యిందన్నారు. ప్రభుత్వం రాగానే రైతుల ఖాతాల్లో జమచేస్తామన్నారు. కేశవ్ ఓట్లు దండుకోవడంలో ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నాడన్నారు. లత్తవరం తండాలో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వకు ఘన స్వాగతం పలికారు. గ్రామ నాయకులు వెంకటేష్ నాయక్, ప్రసాద్, నాగరాజునాయక్, ఎర్రిస్వామి నాయక్, తులసీనాయక్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే చేనేతలకు ఆత్మగౌరవం


ఆత్మీయ సమావేశ వేదికపై ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, చేనేతలు

ఉరవకొండ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో చేనేతల ఆత్మగౌరవం మరింత రెట్టింపయ్యిందని ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక లత్తవరం రోడ్డులోని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో చేనేత కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్క చేనేత కార్మికుడు బ్రాండ్ అంబాసిడరే అన్నారు. చేనేత వర్గాలకు చెందిన పిల్లలు ఉన్నత చదువులు చదివి నేడు డాక్టర్లు, ఇంజనీర్లయ్యారంటే.. అందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలే అన్నారు. చేనేతలకు నేతన్న నేస్తంతో పాటు 50 ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి అర్హత ఉంటే చాలు..పింఛన్లు అందించినట్లు తెలిపారు. ధర్మవరం తర్వాత అత్యధికంగా చేనేత వృత్తి పై ఆధారపడిన ఉరవకొండలోని కార్మికులకు కొత్త డిజైన్లలో చీరలు నేసేందుకు రెండు చేనేత క్లస్టర్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇళ్లు,ఇంటి స్థలాలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర నాయకులు చెంగల మహేష్, కరూర్ వెంకటేష్, చందా చంద్రమ్మ, ఎంసీ సత్యవతి, ఎంసీ నాగభూషణం, మిడతల చంద్రమౌళి, కొత్తపల్లి హరి, ఎంసీ నాగభూషణం, నిమ్మల వెంకటరమణ, కాసుల ఆంజి, బీరేశివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్


గుత్తి: రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామి దాస్ మాదిగలకు పిలుపునిచ్చారు. గుత్తిలోని ఎస్సీ కాలనీలో గురువారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. అనంతరం కాలనీలో మాదిగలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకటరామిరెడ్డి, అనంతపురం ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాయలసీమ కార్యదర్శి సుంకన్న మాదిగ, గుంతకల్లు మండల అధ్యక్షుడు పవన్, ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, సునీల్ కుమార్, మల్లి, ఓబులేసు, లక్ష్మిదేవి, కోళ్లమ్మ, మహేష్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే నాయీ బ్రాహ్మణుల సంక్షేమం


ఓటు అభ్యర్థిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని ఆ సంఘం పట్టణ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. గురువారం పట్టణంలో అత్యధికంగా నాయీ బ్రాహ్మణ కులస్తులు నివాసముంటున్న సంజీవనగర్, నాయీబ్రాహ్మణ కాలనీ, మోదినాబాద్, భాగ్యనగర్, బీటీ.పక్కీరప్ప కాలనీల్లో కులసంఘం పెద్దలు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా వైవీఆర్, ఎంపీగా శంకర్‌నారాయణలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, వీరాంజనేయులు, రాజాజీ, రంగస్వామి, సూర్యనారాయణ, రమేష్, ఆనంద్, కుమార్, భీమరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా సాక్షి గణపతి ఆలయ వార్షికోత్సవం


విశేష పూజలందుకున్న సాక్షి గణపతి మూలవిరాట్

ఉరవకొండ: స్థానిక మల్లేశ్వరస్వామి ఆలయంలోని సాక్షిగణపతి ఆలయ 24వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామికి పంచామృతాభిషేకం, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వినాయకుడికి వందల లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మాదిగలు టీడీపీకి బుద్ధి చెప్పాలి


రజాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుత్తి రూరల్: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చి, మోసం చేసిన చంద్రబాబును ఓటు అనే వజ్రాయుధంతో మాదిగలు బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు రాష్ట్ర కో-కన్వీనర్ వై.భీమిలింగ కోరారు. గురువారం మండలంలోని రజాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇంటింటా తిరిగి వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామి డ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ సంగ్రామంలో ప్రతి ఒక్కరూ పేదల పక్షపాతి సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సాలప్ప, సునీల్, హరి, పక్కీరప్ప, సంపత్, జయరాం, రంగయ్య, నరశింహ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి


బాచుపల్లిలో కరపత్రం అందజేస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు


తొండపాడులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ విశాలాక్షి, జెడ్పీటీసీ రాధిక

గుత్తి రూరల్: అనంతపురం ఎంపీగా శంకర్‌నారాయణ, గుంతకల్లు ఎమ్మెల్యేగా వెంకట్రామిరెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, జెడ్పీటీసీ రాధికాయాదవ్, సర్పంచ్‌లు కర్లకుంట రమేష్‌బాబు, రుక్మిణమ్మ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని తొండపాడు, జక్కలచెరువు, కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, స్థానిక నాయకులు బేడల వెంకట్రాముడు, మల్లయ్యయాదవ్, ప్రవీణ్ కుమార్‌యాదవ్, పురుషోత్తంయాదవ్, ఇబ్రహీం, రంగస్వామి, రంగన్న, నాగరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టండి

వజ్రకరూరు: మాతా శిశుమరణాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ పి.యుగంధర్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సర్దార్‌వలి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో ప్రచారం

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురి, గడేహోతూరు, పొట్టిపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ముమ్మర ప్రచారం


పామిడిలో డిజిటల్ ఈవీఎంలతో అవగాహన కల్పిస్తున్న నాయకులు


పామిడిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పామిడి: పట్టణంతో పాటు రూరల్ గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ పార్టీశ్రేణులు డిజిటల్ ఈవీఎంలతో ముమ్మరంగా ప్రచారం చేశారు. పామిడిలోని 11, 13, 17 వార్డులతో పాటు ఎద్దులపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బ్యాలెట్ ఈవీఎంలో మూడో నంబర్‌లోని వై వెంకట్రామిరెడ్డికి, ఎంపీ అభ్యర్థిగా బ్యాలెట్ ఈవీఎంలోని నాల్గవ నంబర్‌లోని ఎం శంకరనారాయణకు సంబంధించి ఫ్యాను గుర్తుపై రెండు బటన్లు నొక్కి జగన్‌ను మరోసారి సీఎంగా దీవించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎన్ఆర్‌బి ఎం.కుమార్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, జీ రాజశేఖర్‌రావు, నాగభూషణ్‌రావు, పార్వతీశ్వర్‌రెడ్డి, ముకుందా, రాజు, సర్పంచ్ వెంకటరమణమ్మ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 1, 2వ వార్డు ఇన్‌చార్జ్‌లు మునగల రంగనాయకులు, పెద్ద వెంకట్రాముడు, సత్య, ధనుంజయ తదితరులు ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యేగా వై వెంకట్రామిరెడ్డి, ఎంపీగా ఎం.శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే పామిడిలో ఓసీ విభాగం డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి బసవరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ బీకే రహీమ్, అనుంపల్లి సూరి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నారపరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, జిలాన్, మహేశ్వర్‌రెడ్డి, సింగరప్ప పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీ

పామిడి: పట్టణంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక బీసీసీ రోడ్డులోని సరస్వతీ ఉన్నత విద్యా మందిరం నుంచి అంబేద్కర్ సర్కిల్, వైఎస్ విగ్రహ సర్కిల్, మెయిన్‌బజార్ మీదుగా ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైఎస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీవీ మంజునాథ్‌రెడ్డి తదితర ముఖ్యులు పాల్గొంటారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

కూటమి పేరుతో దోపిడీ


దేరంగుల ఉదయ్ కిరణ్

గుంతకల్లు రూరల్: కూటమి పేరుతో ప్రజల సంపదను దోచుకునేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పొత్తుతో వస్తున్నారని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ విమర్శించారు. గురువారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అయితే, బీసీలను మోసం చేసింది మాత్రం చంద్రబాబు అన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని గెలిచిన తరువాత వెనకబడిన వర్గాలుగా అభివర్ణించిన వ్యక్తి చంద్రబాబన్నారు. కానీ ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో బీసీలకు ఏదైతే చేస్తానని జగన్ హామీ ఇచ్చారో.. అది చేసి చూపించారన్నారు. బీసీలు ఎట్టి పరిస్థితుల్లోనూ చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దన్నారు. బీసీల అభివృద్ధి కోసం పాటుపడిన వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు

కూడేరు: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎన్నికల ప్రవర్తనా నియమావళి అధికారి ముస్తఫా కమల్ బాషా హెచ్చరించారు. గురువారం మండలంలోని అనంతపురం - బళ్లారి ప్రధాన రహదారిపై ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. అనిమానిత వాహనాలను పరిశీలించారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అక్రమంగా డబ్బు, మద్యం, దుస్తులు, ఇతర వస్తువులను తరలించకుండా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.

కమ్మూరులో విస్తృత ప్రచారం


కమ్మూరులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ రంగారెడ్డి, నేతలు

కూడేరు: మండలంలోని కమ్మూరులో ఎమ్మెల్యే అభ్యర్థి వై. విశ్వేశ్వర రెడ్డిని గెలిపించాలని సర్పంచ్ చిన్న రంగారెడ్డి , నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుదామని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంగప్ప, వన్నూరప్ప, పెద్ద రంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొదటి విడత అడ్మిషన్లు మొదలైన నేపథ్యంలో అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తిరుపతి నరేంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. జూన్ 10లోగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలెక్ట్రీషియన్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

గ్రంథాలయం తనిఖీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని వన్‌టౌన్ పీఎస్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రథమ శ్రేణి గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. రికార్డులు, పోటీ పరీక్షల పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయాధికారి కమ్మన్న, సహాయ అధికారిణి హేమలత, రాము తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడికి గాయాలు

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్ ఔటర్ సిగ్నల్ వద్ద బుధవారం రాత్రి బాలరాజు అనే ప్రయాణికుడు రైలులో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. మంత్రాలయానికి చెందిన అతడు రైల్లో డోర్ వద్ద నిలుచుని ఉన్న సమయంలో జారి కింద పడ్డాడు. గాయపడిన అతడని జీఆర్‌పీ పోలీసులు గుత్తి ఆస్పత్రికి తరలించారు. ఘటనపై జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మా నాన్న విశ్వేశ్వరరెడ్డిని గెలిపించండి


జయపురంలో మాట్లాడుతున్న యువనేత ప్రణయ్ రెడ్డి


జల్లిపల్లి టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రణయ్ రెడ్డి

కూడేరు: మా నాన్న విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని యువనేత వై. ప్రణయ్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం ఆయన మండలంలోని జయపురం, చోళసముద్రం, కొర్రకోడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకొస్తేనే పల్లెల రూపురేఖలు మారుతాయని, ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. టీడీపీ నాయకులు ఇచ్చే డబ్బులు, మాయమాటలు నమ్మి పోసపోవద్దని కోరారు. ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే పయ్యావుల కేశవ్‌ను త్వరలో జరిగే ఎన్నికల్లో సాగనంపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు నాగభూషణం, శివలాల్ రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీపీ నారాయణ రెడ్డి, నేతలు తుప్పటి హరీష్, రామచంద్రారెడ్డి, హరినాథ్ రెడ్డి, చోళసముద్రం గంగాధర్, కొర్రకోడు రాజశేఖర్, సంజీవరాయుడు, పెన్నోబులేసు, లోకనాథ్ స్వామి, వడ్డే గంగాధర్, వెంకటరామిరెడ్డి, శంకర్ రెడ్డి, అశోక్, వెంకటేష్, లాలెప్ప, దేవేంద్ర, ఎర్రిస్వామి, సిద్ధారెడ్డి, మదన్ మోహన్ రెడ్డి,నారాయణ, విజయ భాస్కర్ రెడ్డి, శంకర్ నాయక్, నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. గురువారం జల్లిపల్లికి చెందిన టీడీపీ నేతలు గురువారం జయపురంలో యువనేత వై. ప్రణయ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మీసాల నాగన్న, బోయ వెంకటేష్, దానే శివయ్య, గొల్ల వెంకటేష్, జెన్నే సూర్యనారాయణ, హరిజన ముత్యాలప్ప, వడ్డే వెంకటేష్, పల్లె నాగేంద్రలు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సిద్ధారెడ్డి, దేవేంద్ర, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్‌కు ఓటు వేసి సంక్షేమ పాలనను స్వాగతించండి


22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


23వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుత్తి: గుత్తిలోని 22, 23వ వార్డుల్లో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్ సులోచన, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, పట్టణ కన్వీనర్ పీరా, సీనియర్ నాయకులు షఫి, అనీస్, వెంకటేష్, రఫి తదితరులు ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

పీసీ ప్యాపిలిలో జోరుగా ఎన్నికల ప్రచారం

వజ్రకరూరు: వజ్రకరూరు, పీసీ ప్యాపిలిలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకమ్మ, సర్పంచు జ్యోతిబాయి, నాయకులు రమేష్, ఎర్రిస్వామి, చంద్రానాయక్, కిష్టప్ప, ప్యాపిలి వీరా, మాబు, వలి, సత్యప్పగౌడ్, అర్జున్, భీమా, ఓబుళేసు, విజయ్ కుమార్ నాయక్, మంగమ్మ, విరుపన్న, రామలింగ, సర్పంచు మోనాలిసా, నాయకులు శశాంక్‌రెడ్డి, రవికాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించండి

గుంతకల్లుటౌన్: టీడీపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబించిన మోదీతో చేతులు కలిపిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మోదీకి తొత్తుగా మారిన చంద్రబాబుకు దిమ్మతిరిగే తీర్పునివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, సత్తార్, జిలాన్, ఆశాబీ, మాబున్నీ తదితరులు పాల్గొన్నారు.